గులాబి

వి. యస్. గిరిగారు

చల్లనిగాలిసోకింది. హాయిఅనిపించింది. కళ్లువిప్పిచూసేను మెల్లిగా. సౌందర్యమైనప్రకృతి అవుపడ్డది. అదివరకట్లాచూడకుండడంచేత అదే నాపుట్టుకనుకుంటా. క్రమముగావొస్తోంది నాకుడివేపునుంచి వెలుగు. రానురాను ఆదిక్కున ఎఱ్ఱనిబింబం వొకటి భూమిలోంచిలేచినట్టు లేచిందిపైకి. ఆబింబంనుంచే వెలుగంతా యెగజల్లబడుతోంది. మరికొంచం సేపట్లో ఆశాంతం అదీపోయి బట్టబయులు అయింది.

నాల్గుదిక్కులా వ్యళ్లీచూసేను. నేనొకర్తనేకాదు నాచుట్టుప్రక్కల అనేకులున్నారు నాలాంటివాళ్లు. నాకన్నచాలా పెద్దవాళ్లు, నాయీడువాళ్లు, కళ్లుతెరవక పచ్చనిపచ్చడాల ముసుకులోంచి యింకా తొంగి చూస్తోన్నవాళ్లుకూడావున్నారు. మరికొందరి రూపంవునికి నాదిమల్లేనే వున్నాయి. కాని వర్ణభేదంమాత్రం వుందిఎఱ్ఱగా, పచ్చగా, తెల్లగా. మరికొంతదూరాన యింకా కొందరున్నారు. అయినా వాళ్లరూపంవునికి అన్నీవేరు. వాళ్లజాతే వేరు.

దూరంనుంచి ఒకాయన మమ్మల్నందరినీ పరీక్షిస్తోవస్తోన్నాడు. కొందర్నికోస్తోన్నాడు అమాంతం. నాకుభయమైంది నన్నుకూడా కోస్తాడేమోనని. నాదగ్గిరికొచ్చి తనవల్లనికత్తితో కదిలించేడునన్ను. నాపక్కనవున్న నాతోబుట్టువు నొకామెని, చాలా పెద్దామెని కోసి బుట్టలో వేసుకొన్నాడు. చాలామంది తమదుర్దశకి ఏడుస్తోవున్నారుదాంట్లో. ఆకోసినతావుల్లోంచి అశ్రుబిందువులు కారుతోన్నాయి. నన్ను చూసి అన్నారువాళ్లు: "నీక్కూడాయిట్లాంటివిధే రానుందమ్మా! ఎందుకుపుట్టావమ్మా? నువ్వుకూడా మామల్లే చావడానికి!" అంటూకంట తడిపెట్టుకొన్నారు. ఎందుకుపుట్టేనా నిజంగా అని విచారించా. అయినా నా చేతులో యేముందిపుట్టడానికి, పుట్టకపోవడానికి? నన్నుపుట్టించమని తపస్సుచేసి బతిమాలానా! ఎట్లా కావాల్సుంటే అట్లాఅవుతుంది. ఏంచేస్తాం! తప్పించుకొని పారిపోవడానికి వీలుందాఏమైనా?

వృద్ధిఅయినకల్లే క్షీణిస్తోందివెలుగు. ఆయెఱ్ఱనిబింబంమరొకవేపున మళ్లీమాయమవుతోంది భూమిలోకి. కిందివేపున చిన్నకొమ్మలమధ్యవున్న నారపుడకలచిక్కులో ఒకచిన్నపిట్టవొచ్చికూచుంది.

మరలచీకటయింది. దూరంనుంచి ఒకాయనవడుస్తో నాదగ్గిరికొచ్చి రాతిమీదకూచున్నాడు. పొద్దుటాయనమల్లె మోటుగాలేడు. చాలాఅందంగాఉన్నాడు. గుడ్డలుగూడా చాలామృదువైనవి. అయినా గుడ్డల మీద వొంటిమీద యేమాత్రం లక్ష్యంలేనట్టు ఆలోచిస్తో కూచున్నాడు. చాలాసేపయింది. పెద్దగాలొకటి వీచింది. ఆగాలిచేత ఆయన తలకిదగ్గిరిగాజరిగానేను. నావేపుచూశాడు. ఆచూపుల్లోనే లలితత్వం, విచక్షణాజ్ఞానం, నాయందల్ప్రేమా అన్నీ ఇమిడివున్నాయి. మృదుత్వంగానన్ను చేతితోతాకేడు. ముద్దు పెట్టుకున్నాడు. ఎందుకు నామీదింతదయ ఈయనకి?

కోశేడు. అట్లాచేస్తాడనుకోలా. నాబాధ ఆయనకి తెలియకా? అయినా అవల్లటివాడి బుట్టలోపడ్డ దానికన్న ఈనాగరికునిచేతుల్లో పడడం నయమని తృప్తిపొందా.

పెద్దబంగళాలోకి తీసికెళ్లేడు. ఎటుచూసినా గోడలూ, పటాలు. కిటికీల్లోంచిగాలివస్తోన్నా బిగబట్టి నట్టుందిగాని స్వేచ్ఛగావీచడంలేదు. ఒకబల్లమీద నన్నుంచి దీపంవెలుగులో ఒకకాగితంమీద యేమో రాశేడు. దాన్నిచించి ఇంకోమాటురాశేడు. ఆకాగితాన్ని నన్ను ఇంకొకకాగితపుసంచిలో కుక్కేడు. నారెక్కలన్నీ అణిగిపోయాయి. చాలానొప్పిపెట్టింది. ఏంచేయను భరించక? ఖర్మం!

చాలాసేపున్నా ఆసంచిలో. సంచికదిలింది. రెండుమెత్తనివేళ్లు మెల్లగానన్ను సంచిలోంచిబయిటికి తీశాయి. చాలావెలుగుంది. కాని అది చాలాచల్లంది. ఆకాంతిని యెగజల్లే ఆబింబంఎఱ్ఱగాలేదు. తెల్లగావుంది.

గాలిరివ్వనవీచడంమాని తెలియనట్టు మెల్లిగాకదుల్తోంది. నన్ను సంచిలోంచి తీసిన ఆరెండువేళ్లు చాలా అందమైనఆమెవి. ఆమెదేహపువన్నె మృదుత్వంచూసి సిగ్గేసిందినాకు. నన్ను తనపక్కన రాతిమీదుంచి ఆకాగితం చదివింది. చప్పున నారెక్కలన్నీ నొప్పిపెట్టేట్టు తనపెదిమలకి వొత్తుకుందినన్ను. ఆమెత్తని పెదిమలసందులోంచి వొచ్చేకమ్మనివాసన నావాసనకన్న యెన్నోయిమ్మళ్లు తియ్యగావుంది. నాలుగైదుసార్లు నన్నుముద్దుపెట్టుకొని నారెక్కలాగ నున్నగావున్న తనచెంపకి అణిచిపెట్టుకుంది కొంతసేపు. పైనుంచి సన్నని వుడుకునీళ్లధార వొకటివొచ్చి నన్నుతడిపింది. తిరిగిచూస్తే ఆధార ఆమెకంటిలోంచి వొస్తోంది. ఈమెకూ దుఃఖమేనా? యెందుచేత? నాకు అంటే విధిలేదుకాని యీమెకేంఖర్మం?

చాలాసేపు అట్లాగేకూచుంది ఏమోఆలోచిస్తో. ఎవరోవొచ్చినట్టు చప్పుడయింది. ఆకాగితాన్నీనన్నూ తనచట్టురవికలో దాచుకుంది. ఆవెచ్చనిదేహం నావొంటికి తాకేటప్పటికి హాయివల్ల వొళ్లుగగుర్పొడిచింది.

ఆదేహపుకదలికచేత ఆవెచ్చనిమెత్తదనంకిందిచప్పుడుచేత ఆమెవొకచోట వుండలేదనీ, ఆమెకు మనోస్వస్థతలేదనీ తెలిసింది. ఆవొచ్చినవ్యక్తి కఠినంగా ఈమెని మాటలాడినట్టు ఆరవికలోంచి విన్నా కొద్దిగా. అలసటచాత అప్పుడప్పుడు ఆమెవొంటిలోంచి సన్ననితడివొచ్చి నారెక్కలకితాకింది. చాలాసేపయాక ఇంకోదేహంవొచ్చి నన్ను ఆమెదేహానికి అణిచింది. ఆదేహంలోంచికూడా అట్లాంటిచప్పుడే వొస్తోంది. ఆమెవేళ్లు నన్ను నాపక్కని కాగితాన్ని బైటికితీశాయి. ఆమెదేహానికి అతుక్కోడంచాత నారెక్క ఒకటివిరిగి అక్కడేవుండిపోయింది. వొక్కసారి స్వచ్ఛమైనగాల్ని చాలనిపించేటట్టుపీల్చా.

నన్నీమెదగ్గిరికి పంపినాయన ఈమె పెద్దచెట్టుచీకట్లోవున్నారు. ఆచెట్టుకొమ్మలసందులోంచి ఆతెల్లని బింబం తొంగిచూస్తోంది. నామీదలక్ష్యమేలేదు వాళ్లకి. ఆచెట్టుమొదట ఆకాగితంమీదవుంచింది నన్నామె.

ఏంచేయను! జరిగేశక్తివుంటేనా నాకు అమాంతంఅక్కణ్ణుంచిలేచిపోయి మళ్లీనాతావునుచేరేదాన్ని. లేకపోతే యెవరికీ అవుపడకుండా పొయ్యేదాన్నియెక్కడికైనా. మాయమయ్యేదాన్ని. భూమ్యాకాశాలు కలిసినట్టు అవుపడేచోట ఆమెత్తదనంవుందిచూడు అక్కడ ఆమెత్తదనంలో అణిగిపొయ్యేదాన్ని. అప్పుడు నాకీబాధలన్నీ తప్పేవి. వీళ్లకంటికే దుర్లభమయ్యేదాన్ని. ఏజన్మాన యేంపాపంచేశానని యిట్లాబాధించాలి వీళ్లునన్ను. ఆయననన్నుకోసేటప్పుడు ఒకచిన్నముల్లు తనవేలుకితాకితే చప్పునవేలునిర్ఘూపించి ఆముల్లుకోసి తన వేలుకేసిచూశాడు యెగాదిగా. అంతమాత్రపు బాధనే తను భరించలేకపోతే నన్ను తామిట్లా నలిపేస్తే నేనెట్లాభరించగలనని విచారించవద్దూ?

మళ్లీ తీసికెళ్లింది. ఆమె నన్ను ఒక చీకటిపెట్టెలో దాచింది. ఈకష్టకాలంలో నేనొక్కత్తెనేగాకుండా ఆకాగితాన్నికూడా నాతోజతచేసిందిపాపం. అయినా ఆకాగితంతో నాకేమీ లాభంలేక పోయింది. దానిస్థితిగతులను తెలిసికొనినావిషయం కొంచం వెలిబుచ్చుకొనడానిగ్గూడా అవకాశంలేదు. ఒకచోటవున్నామంటేవున్నాం. అంతే.

నీరసంయెక్కువయింది ఆహారంయేమాత్రం లేకపోవడంచేత. పీల్చడానికి గాలికూడా దుర్లభ మయిందాచీకటిపెట్టెలో. చచ్చిపోయినట్టున్నాదాంట్లో.

చాలాసేపయాక మళ్లీబయటికి తీసిందినన్నామె. ఆకాగితాన్నికూడా దీపంవెలుగులో ఒకబల్లమీద వుంచింది. ఆబల్లకు ఆమెకెదురుగా నున్నగా పెద్దగాయేదోవుంది. దాంట్లో ఆమె నేను కాగితం దీపం అన్నీ అవుపడ్డాయి. దాంట్లో చూసింతరువాత తెలిసింది నారూపంయెంతమారిపోయిందో. రక్తంయేమాత్రం లేకుండా అయింది. జీవితంమీది ఆశేవొదిలిపోయింది.

ఆమెకేసి చూశా నువ్వేకదా నామృత్యుదేవతవి అని. ఈ కాగితంలో చూస్తే ఇంకోహృదాంట్లో యేదో రాస్తోంది. ఆ రెండు కళ్లలోంచి నీటిధారలు కారుతోన్నాయి. ఆ పెదిమలు వణుకుతోన్నాయి. ఏమవుతోందో ఆమెకు నాకు తెలీలా. నీళ్లుకారే ఆ చెంపదగ్గరైనా నన్ను వుంచుతే బావుండేది. ఆ కాస్త తడైనా పోయేది. కాని ఆమెకి నేనిప్పుడు అవసరం లేకుండా అయ్యాను. ఆ కాగితంవేపు చూస్తే ఆవేశంతో రాస్తోంది. చెంపవెంబడి జారి కాగితంమీద పడే కంటినీళ్లమీద కూడా దృష్టిలేదామెకి. నీళ్లు కారుతోన్నాయన్న విషయమే తెలీనట్టుంది.

తనహృదయావేదన మనోస్థితినంతా ఆ కాగితంమీద చక్కగా చిత్రించాలని ప్రయత్నిస్తోంది. కాని ఆ చిత్రము తగినట్టు కుదర్డంలేదు. బాధపడుతోంది. రాస్తోంది. ఆది తృప్తికరంగా లేకపోవడం తెలిసికొని కొట్టేస్తోంది. ఆలోచించి మళ్లీ రాస్తోంది.

ఇట్లా ఒహసారి రాసిందాన్ని కొట్టేసి అకస్మాత్తుగా నావేపు చూసింది. తనయెడమచేతిని నావేపు జాచింది. నన్ను తన చెంపకి అద్దుకుంటోందిగాఁవును నా అదృష్టం బండిందిగాఁవును అనుకున్నా. కదిలించింది. అబ్బా! మనం ఆశించేదొహటి జరిగేదొహటి. నా రెక్క నొహదాన్ని పూడబీకింది. నాలికతో నోట్లోకి తీసికొని చప్పరించింది. ఇంత క్రూరం చేస్తుందని యెప్పుడూ అనుకోలా.

ఒహటీ ఒహటీ రెక్కలన్నిట్నీ ఊడబీకి తిన్నది రాక్షసిలాగ. అప్పుడు కాని ఆమె రాత పూర్తికాలా. కాగితాలన్నీ తీసికొని లేచిపోయింది. ఆ బల్లమీద రెండు పుస్తకాలు నేనే మిగిలాం. నా రూపాన్ని చూసుకుంటే దుఃఖం ఆగిందికాదు. పెద్దని అందమైన ఆకారమంతా మాయమయ్యి నగ్నంగా నేనే మిగిలాను. నా సురూపమంతా నశించిపోయాక నే నెవరికి కావాలి?

దీపం ఆరిపోయింది. మళ్లీ చాలా సేపు చీకట్లో వున్నా.

క్రమంగా కిటికీలోంచి తెల్లని కాంతి రావడం ఆరంభించింది. కాంతిని యెగజల్లే ఆ యెఱ్ఱని బింబం కూడా అవుపడ్డది ఆ కిటికీలోంచి. నేను పుట్టినవాడు ఆ బయిల్లో యీసమయాన యీయెఱ్ఱని బింబం వెల్లిన సమయాన నాకెంత ఆనందం అనిపించింది! ఈవాళ యెట్లా మారింది నాదశ!

వెలుగు చాలా వొచ్చింది. ఒహాయన—నల్లనాయన వొచ్చాడు. చేతులలో వున్న ఒహ పెద్దగుడ్డలో ప్రతి వొస్తువుని తుడుస్తోన్నాడు. అన్నిట్నీ తుడిచి నేనున్న బల్లదగ్గిరికి వొచ్చేడు. ఆ పుస్తకాల్ని తుడిచి భద్రంగా ఒహపక్కన వుంచేడు. ఆ గుడ్డను బలంగా బల్లమీద కొట్టి నన్ను గూడా కొట్టాడు. దూరాన ద్వారం దగ్గిర పోయిపడ్డా. ఏం దశ నాది! ఏ కోచెత్త అనుకున్నాడుగాఁవును? అక్కడే ఆ బల్లమీద వుండడానికి అనర్హురాలిననుకున్నాడుగాఁవును! వొస్తోన్నాయి. ఆ మోటు నల్లని కాళ్లు నాదగ్గిరకొస్తోన్నాయి. తొక్కుతాడు. తప్పదు. అబ్బా, అబ్బా! ఇట్లా రాసుందా నా అంతం?

జానకి మనస్సు

అధికార్ల సూర్యనారాయణరావుగారు బి.యె;బి.యల్.

గాలివీచుచునుండ గదలుపర్ణంబు   రాజుపొడమిన బొంగు రత్నాకరంబు
వెలుగు గ్రమ్ముచునుండ వికసుపుష్పంబు   రవిబాలు డుదయింప రగులును నభంబు
వాసంతమలరింప బాడును పికంబు   నవనవాంగకమెన్న కవితనయనంబు
నన్ను గాంచిన నవ్వు నా చెలిముఖంబు.   సఖుని నలపెంచు నా జానకిమనంబు.